


# తిరిగి రాని వసంతం

పన్నెండేళ్ల తరువాత స్వదేశానికి వచ్చిన నన్ను పట్టుకుని ఏడ్చేసింది అమ్మ. పైకి గంభీరంగా వున్నా నాన్న కూడా లోలోపలే వ్యధ చెందుతున్న విషయం నాకు తెలుస్తూనే వుంది.

ఇరవై మూడేళ్ల ప్రాయంలో అలిగి అమెరికా వెళ్లిపోయాను నేను – శేషను పెళ్లాడడానికి నాన్న వొప్పుకోలేదన్న కారణంగా.

శేష! నా చిన్ననాటి నెచ్చెలి. నా గుండెల్లో గూడుకట్టుకున్న అనుంగు చెలి. పసుపు, పాల మీగడ రంగరించి మంచి గంధము, గులాబి రేకులూ మిళాయించి రూపొందించిన స్వర్ణ ప్రతిమలా వుండేది పద్దెనిమిదేళ్ల శేష. నా

ఊహల్ని, ఊపిరినీ శాశ్వతంగా గుత్తకు తీసుకున్న తరుణి.

అమ్మ, నాన్నల ప్రశ్నలకు ముక్తసరిగా జవాబులు ఇచ్చాను... ఇంటి దగ్గర రెండు రోజులు వుండి, అక్కయ్య దగ్గరకని చెప్పి సీతాపురం బయలుదేరాను. సీతాపురానికి అయిదు కిలో మీటర్ల దూరంలో వుంది రామాపురం – శేష ఊరు.

అక్కయ్య అత్తవారి ఊరు రామాపురమే. బావ వ్యవసాయం చూసుకుంటూ పుగాకు వ్యాపారం చేస్తుంటాడు. కారణాంతరాల వల్ల అయిదేళ్ల క్రితం మకాంని సీతాపురానికి మార్చారట.

ఇరువైపులా పచ్చటి పొలాలు స్వాగతం పలుకుతూంటే... నడుమ కొండచిలువలా సాగిపోతున్న కంకర రోడ్డు మీద ఎర్రమన్ను రేపుకుంటూ, దడదడ శబ్దం చేసుకుంటూ వచ్చి సీతాపురంలో ఆగింది బస్.

గతుకుల రోడ్డు... ఇరుప్రక్కలా వున్న మండువా లోగిళ్లూ... పాక హోటళ్లూ... సోడా బడ్డీలూ... దుమ్ము కొట్టుకుపోయి, కళ్లద్దాలు విరిగిపోయిన పూజ్యబాపూజీ నిలువెత్తు విగ్రహమూ... ఏడాదిలో రెండుసార్లు జెండా ఎగురవేసేందుకు కట్టిన సిమెంట్ పోతా కనిపించలేదు నాకు.

నన్ను చూడగానే దుఃఖం ఆపుకోలేక ఏడ్చేసింది అక్క. బహుశా నా కంట్లోని నీళ్లన్నీ ఇంకిపోయాయేమో, కొయ్యలా వుండిపోయాను నేను.

బావ పనిమీద పొరుగూరు వెళ్లాడట. రాత్రికిగానీ తిరిగిరాడు. నాకిష్టమైన వంటకాలు చేసి, నేను వద్దంటూంటే తన మీద ఒట్లు పెట్టుకుని

## తిరుమలశ్రీ

దగ్గర కూర్చుని బలవంతంగా తినిపించింది అక్క. నాకంటే అయిదేళ్లు పెద్దది తాను. చిన్న వయసులోనే పెళ్లయ్యింది... అక్క బలవంతం మీద నడుం వాల్చినా, శేష తలపులతో కునుకు పట్టలేదు నాకు. లేచి, రామాపురం వెళ్లివస్తానని చెప్పి బయలుదేరాను. అక్క ఏదో అనబోయి ఊరుకుంది.

రోడ్డుమీదకు వచ్చాను. అదే మెయిన్‌రోడ్డు, బస్టాండూను ఆ ఊరికి. బస్‌రూట్ అంతటితో ఆఖరు. రోడ్ చివర కాలువ, దానిపైన లాకులూను. లాకులు దాటితే ఏటిగట్టు – ఆ పైన వశిష్ఠ గోదావరి... గోదావరి వొడ్డుకు నడిచాను. తన సొగసులతో చిన్నప్పట్నుంచీ నన్ను అలరిస్తూంటుంది ఆ నదీమతల్లి. కాని, ఆ రోజెందుకో పచ్చని ప్రకృతి కార్చిన వెచ్చని కన్నీటి ప్రవాహంలా అనిపించింది. బహుశా గోదావరి అందాలను ఆస్వాదించే స్థితిలో నేను లేకపోవడమే అందుకు కారణమై వుంటుంది.

కాలువ గట్టమ్మట అయిదు కిలోమీటర్లు వెళ్తే రామాపురం వస్తుంది. మెల్లగా నడక ఆరంభించాను. ఆ గట్టుపైన అడుగుపెట్టానో లేదో జ్ఞాపకాల తట్టు ఝుమ్మని రేగింది...

* * *

స్కూల్‌కి సెలవులు ఇచ్చినపుడల్లా రామాపురం పయనమయ్యే వాణ్ణి నేను. వేసవి సెలవులు అక్కయ్య దగ్గర గడపడం ఆనవాయితీ అయిపోయింది. నేను వచ్చినట్లు తెలియగానే అక్క ఇంటివద్ద ప్రత్యక్షమయ్యే వాళ్లు నా నేస్తగాళ్లంతా. వారిలో – బావ తమ్ముడు రాముడు, అక్క బావగారి కూతురు పార్వతి, మునసబు గారమ్మాయి శేష, కరణంగారబ్బాయి కృష్ణ,

నాయుడుగారబ్బాయి చంద్రం, ఆ ఊరి ఎలిమెంటరీ స్కూల్ హెడ్మాస్టర్‌గారి అబ్బాయి వెంకటేశం ముఖ్యులు. మా అందరివీ ఇంచుమించు ఒకే వయసులు. అందరిలోకీ అందంగా, మెరుపుతీగలా వుండేది శేష. ఆల్చిప్పల్లాంటి నీలాల కన్నులతో, మేలిమి బంగారు మేనిచాయతో ముద్దుగా వుండేది.

ఎండనక, కొండనక పొలం గట్లమ్మట, తోటలమ్మటా పడేవాళ్లమంతా. తాటికాయలంత సైజ్‌లో చేతికి అందేంత ఎత్తులో విరగ కాసిన తీయటి మామిడికాయలను కోసుకొని గట్టుకేసి పగులగొట్టుకుని తినేవాళ్లం. పొలాలలోంచి కందికాయలు కోసుకువచ్చి కాల్చుకుని తినేవాళ్లం. మూతులు, చేతులు మసి చేసుకుని తమాషాగా వుండేవాళ్లం. సీమచింత చెట్ల గుబుర్లలో దూరి ఎర్రటి దోరకాయల్ని కోసుకు తెచ్చుకుని పంచుకునేవాళ్లం. ఆ ప్రాసెస్‌లో వొళ్లంతా గీరుకుపోయినా లెక్కచేసేవాళ్లం కాదు. చెరువులో చేపలు పట్టేవాళ్లం. కాలువలో ఈతలు కొట్టేవాళ్లం. గేదెలపైన ఎక్కి స్వారీ చేసేవాళ్లం. కోతికొమ్మచ్చి, చెడుగుడు ఆడి ఒళ్లంతా మట్టి కొట్టించుకోవడమూ, కాలువలోనో చెరువులలోనో మునిగిరావడమో చేసేవాళ్లం...

హారన్‌మ్రోతతో ఆలోచనలోంచి తేరుకున్నాను. పక్కకు తొలగి దారివ్వడంతో వెనుక నుంచి స్కూటర్ ఒకటి నన్ను దాటుకుని వెళ్లిపోయింది... ఎంత దూరం వచ్చానా అని చూసుకుంటే కాలువ అవతల ఏటిగట్టుమీద మారెమ్మ




*'నది' మాసపత్రిక హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ చక్రపాణి గారిచే సన్మానించబడుతున్న ప్రముఖ రచయిత్రి, కాలమిస్ట్ డా।। సి. భవానీదేవి. కార్యక్రమంలో శ్రీయుతులు జస్టిస్ వెంకటరమణ, మండలి బుద్ధప్రసాద్, వి.ఆర్. రావ్ అవ్వాస్ తదితరులు పాల్గొన్నారు.*

కట్ట కనిపించింది. మారెమ్మ ఆ గ్రామదేవత. అక్కయ్యతో కలిసి అక్కడికి వచ్చేవాణ్ణి నేను. శేష కూడా మాతో వచ్చేది. శ్రద్ధతో కళ్లు మూసుకుని, అమ్మవారికి దణ్ణం పెట్టుకునే ఆ పిల్లలను చూసి, 'మారెమ్మ తల్లిని ఏం కోరుకున్నావే శేషా, మా తమ్ముడు లాంటి మంచి మొగుణ్ణి ఇవ్వమనా?' అని వేళాకోళం ఆడేది అక్క. అందుకు శేష ఉడుక్కుని, 'మరే, గెడకర్రలాంటి మీ తమ్ముడే గానీ ఇంకెవరూ దొరకరు నాకు!' అనేది ఆరిందాలా. నావంక దొంగచూపులు చూస్తూ ముసిముసిగా నవ్వుకునేది...

శేష పూర్తిపేరు శేషసాయి. మునసబుగారి ఏకైక సంతానం. ఇంట్లోంచి సున్నుండలు, అరిసెలు, గారెలు – ఏం చేసుకుంటే అవి తెచ్చి నాకు పెట్టందే వుండేది కాదు. కాటుక కళ్లతో ఆసక్తిగా నన్నే చూస్తుండేది. మాట్లాడుతుంటే అబ్బురంగా ఆలకించేది...

ఆలోచనలలో పడి రామాపురం చేరుకోవడమే తెలీలేదు నాకు. కాలువ దాటడానికి బల్లకట్టు స్థానంలో... ఏటిగట్టును కలుపుతూ వంతెన వచ్చింది.

బల్లకట్టు గుర్తుకురావడంతో ఓ నాటి సంఘటన మదిలో మెదిలింది... ఓ రోజున ఏటిగట్టు అవతలవున్న గోదావరి వొడ్డున వున్న తోటకు వెళ్లాలని బయలుదేరాం మా ఫ్రెండ్స్ అంతా. శేష రానంటే బలవంతపరచి తీసుకువెళ్లాను. బల్లకట్టుమీద కాలువ దాటుతూ, అప్పుడే లంక నుంచి తిరిగివస్తూన్న మునసబుగారి కంట్లో పడిపోయాం.

తండ్రి చూసిన చూపుకు కలవరపడ్డ శేష వెంటనే వెనక్కి తిరిగి ఇంటికి పరుగెత్తింది... ఆ తరువాత రెండు రోజుల వరకూ శేష కనిపించకపోయేసరికి నేను చెందిన ఆందోళన మరచిపోలేనిది. తరువాత తెలిసింది, మగపిల్లలతో కలిసి ఏటిగట్టుకు వెళ్తున్నందుకు మునసబుగారు కూతుర్ని బాగా తిట్టారని. అది విని నా మనసు గిలగిల లాడిపోయింది, నా మూలంగా ఆమె తిట్లు తిన్నందుకు...

* * *

అన్నేళ్ల తరువాత మళ్లీ ఆ ఊళ్లో అడుగు పెడుతూంటే నా గుండెలు బరువెక్కాయి. కాలం మా జీవితాలలో మార్పులు తెచ్చినా, ఆ ఊరిలో మాత్రం ఏ మార్పూ తెచ్చినట్లు లేదు. పాడుబడ్డ స్కూల్ బిల్డింగ్ మాత్రం పడగొట్టి మళ్లీ కట్టించినట్టుంది. గ్రామం మొదట్లో అమ్మవారి గుడి, ఆ పక్కనే పోతురాజు గుడి ఎప్పటిలాగే వున్నాయి, సున్నం వెలసిపోయి, గోడల పెచ్చులు వూడిపోయి. వాటిని చూస్తుంటే పాత జ్ఞాపకాలు మళ్లీ తన్నుకు వచ్చాయి నాలో...

కొత్త అమావాస్యకు అమ్మవారి జాతర ఘనంగా జరిగేది. అందులో పాల్గొనేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ఎందరో ఎడ్ల బళ్లమీద, కాలినడకన, సైకిళ్లమీదా వచ్చేవారు. మధ్యాహ్నమైతే జనసందోహంతో కాలు మోపడానికి కూడా సందు దొరికేది కాదు. మూడు రోజులపాటు ఊరంతా ఎంతో సందడిగా వుండేది.

గరగలు ఊరేగుతూ నృత్యం చేస్తూంటే కన్నులపండువగా వుండేది. నేస్తాలతో కలిసి జాతర్లో తిరిగేవాణ్ణి నేను. రంగులరాట్నం ఎక్కేవాళ్లం. పులివేషాల వాళ్లతో పాటు మేమూ డాన్స్ చేసేవాళ్లం. 'కాయ్ రాజా కాయ్!' అన్న పిలుపులకు సై అంటూ గేమ్స్ ఆడేవాళ్లం. ఇష్టమైన తినుబండారాలు కొనుక్కుతినేవాళ్లం. బొమ్మలు కొనుక్కునేవాళ్లం. అమ్మవారు పూనిందంటూ కొందరు వూగిపోతూంటే చిత్రంగా

చూసేవాళ్లం.

ఓ రోజు జాతరలో వాళ్ల నాన్నమ్మతో కలిసి గరగల నృత్యం చూస్తోంది శేష. వెనుకగా వెళ్లి కళ్లు మూసాను. ఉలిక్కిపడి కంగారుగా చేతులు త్రోసేసింది. చాచిపెట్టి చెంపదెబ్బ కొట్టింది. తరువాత నన్ను గుర్తించి నిర్ఘాంతపోయింది. ఇంటికి పరుగెత్తుకుపోయింది. ఎందుకో మునసబుగారింటికి వెళ్లిన అక్కయ్యకు ఏడుస్తూ కనిపించిందట. తరచి అడగ్గా చెప్పిందట – నన్ను కొట్టినందుకు ఏడుస్తున్నట్టు...

* * *

నావంక అంతా వింతగా చూస్తూంటే ఊళ్లో అడుగుపెట్టాను. ఆ గ్రామం మొత్తం మీద వున్నవి రెండే వీధులు. ఆ వీధుల్లోగాని, ఇళ్లలోగాని అన్నేళ్లలో ఎలాంటి మార్పూ లేకపోవడం ఆశ్చర్యం గొలిపింది నాకు... ముందుకు సాగుతుంటే నా చిన్ననాటి నేస్తాలు నా మదిలో మెదిలారు... ఇప్పుడు వాళ్లంతా ఎక్కడ ఉన్నారో! ఏం చేస్తున్నారో?

మునసబుగారిది పెద్దలోగిలి. పొలానికి ఆనుకుని వుంటుంది. రామాలయం ప్రక్క నుంచి వెళ్లాలి. మలుపు తిరుగుతుంటే అంతకు ముందు అక్కయ్య వాళ్లుండే పెంకుటిల్లు కనిపించింది. ఆ ఇంటిని చూడగానే ఆ నాటి అపూర్వ సంఘటన... జ్ఞాపకాల పొరలలో నేను అపురూపంగా దాచుకున్న ఆనందపు ఘటన... మదిలో తళుక్కుమంది...

ఇంటర్ ఫైనలియర్ పరీక్షలు రాసి అక్కగారింటికి వచ్చాను నేను. ఫైనలియర్‌కి రావడంతో క్రితపు ఏడాది సెలవులకు రామాపురం రాలేదు... నేను వచ్చి మూడు రోజులైనా శేష కనిపించలేదు. పెద్దవాడినయ్యానేమో, మనుపటిలా ఆ పిల్లను గూర్చి అక్కను అడగడానికి సిగ్గు, బిడియము అడ్డువచ్చాయి. ఏ రోజు కారోజు ఆమె వస్తుందని ఆశగా ఎదురు చూసాను. నా రాక ఆమెకు తెలీదనుకోవడానికి వీల్లేదు. ఆ గ్రామంలో చీమ తుమ్మినా ఆ వార్త క్షణాలలో వూరంతా ప్రాకిపోతుంది.

ఇక వుండబట్టలేక పార్వతిని అడిగాను. 'శేష ఊళ్లో లేదా?' అని. 'రోజూ నీళ్లకోసం కాలువకు వస్తోందే!' అని, 'ఏం, మునసబుగారి శేష కనిపించక పిచ్చెక్కిపోతోందా ఏమిటీ అబ్బాయిగారికి?' అంటూ పకపక నవ్వింది. నిన్నటి మొన్నటి వరకు, 'మావయ్యా' అంటూ నా వెంట తిరిగే పిల్ల, ఇప్పుడు ఆరింద అయిపోయింది. ఆడపిల్లల్లో వయసు తెచ్చే మార్పేమో అది!

ఊళ్లోనే వుండి, నేను వచ్చానని తెలిసి శేష చూడడానికి రాలేదంటే ఆశ్చర్యం వేసింది నాకు. 'శేష రావడం మానేసిందేం, పారూ?' అనడిగాను. జవాబుగా ముసిముసి నవ్వులు నవ్వుకుంది.

'పారూ! శేషను ఓసారి రమ్మని చెప్పమ్మా? ప్లీజ్!' అంటూ బ్రతిమలాడితే కిసుక్కున నవ్వి, 'నావల్ల కాదు బాబూ!' అంటూ అక్కణ్ణుంచి తుర్రుమంది.

సాయంత్రం సందెచీకటి వేళ... అక్కయ్య బిందె తీసుకుని కాలువకు వెళ్లింది మంచినీటి కోసం. ఇంట్లో నేను ఒక్కణ్ణే వున్నాను మ్యాగ్‌జైన్ చదువుకుంటూ. ఆ సమయంలో చావిట్లో గాజుల సవ్వడి వినిపించి అటువైపు చూసాను.

రూపుదిద్దుకున్న సౌందర్యరేఖలా... నడిచొచ్చిన వెన్నెలకన్నెలా... ముగ్ధమనోహరంగా... ఆకుపచ్చ పరికిణీ జాకెట్టు, ఎర్రటి ఓణీలో... నవయవ్వని, అందాల భామిని... శేష!

ఎవరికోసమై తపించిపోతున్నానో... ఆ నెచ్చెలి హఠాత్తుగా కన్నుల ఎదుట ప్రత్యక్షమ

య్యేసరికి మైమరచిపోయాను నేను... 'వదినా!' అన్న మంజుల స్వరం నా వీనులలో సప్తస్వరాలను పలికించింది.

ఒక్క ఉరుకులో శేషను చేరుకుని ప్రేమతో అలింగనం చేసుకుని... ఆమె అధరాలపై గాఢమైన ముద్రవేసాను. నా పరిష్వంగంలో మైమరచిపోయి గువ్వలా వొదిగిపోయిందామె. అంతకుమునుపెప్పుడూ జరగని సంఘటన అది! కౌగిలిలో ఏదో మత్తువుంది. మహత్తువుంది. అనూహ్యమైన అనుభూతి... ఊహాకందని భావన... మా హృదయాలను పెనవేసింది.

అంతలోనే కలలోంచి తేరుకున్న దానిలా చటుక్కున నన్ను విడిపించుకుని దూరంగా జరిగింది శేష. 'నన్నెందుకు తప్పించుకు తిరుగుతున్నావు, శేషా? నన్నప్పుడే మరచిపోయావా?' అంటూ ఆమె భుజాలు పట్టుకుని కుదుపుతూ అడిగాను. ఓణీ చెంగు నోట్లో పెట్టుకుని అందామె – 'మునుపటిలా నేను ఇల్లు వదలకూడదు.'

'ఏం? ఎందుకనీ!' అనడిగాను.

'వయసొచ్చిన ఆడపిల్లలు అంతేమరి!' నవ్వేసి అక్కణ్ణుంచి తుర్రుమంది.

ఆ తరువాత ఏదో ఒక వంకతో రోజుకోసారైనా వచ్చి వెళ్లేది శేష. అక్కయ్య పనిలో వుంటే మేమిద్దరమూ కబుర్లు చెప్పుకునేవాళ్లం. నేను మాట్లాడితే ఆమె వినేది. ఏమైనా మాట్లాడమంటే మోహనంగా నవ్వేది. నా పలుకులలో అభిమానం చిలికితే, ఆమె చూపులలో అనురాగం వొలికేది.

రామాపురం వచ్చినపుడల్లా అక్కగారింట్లోనే కలుసుకునేవాళ్లం ఇద్దరమూను. నేను చదువుల కోసం విదేశాలకు వెళ్లేముందు అక్క, బావల దగ్గర వీడ్కోలు తీసుకోవడానికి వచ్చినపుడు – విషయం తెలిసి మూగగా రోదించిందే తప్ప నోరెత్తి ఏమీ అనలేదు శేష. రెండేళ్లలో చదువు ముగించుకుని తిరిగొస్తానని నేనంటే మౌనంగా తలూపిందే తప్ప, తన మదిలో ఏముందో ఏనాడూ బయట పెట్టలేదు.

అమెరికాలో ఎమ్మెస్ పూర్తిచేసుకుని వచ్చేసరికి నాపెళ్లి ప్రస్తావన వచ్చింది ఇంట్లో. నా మనోవాంఛను వెల్లడి చేసాను. శేషను పెళ్లిచేసుకోవడానికి నాన్న వొప్పుకోలేదు.

ఎంతటి అందం వున్నా చదువురాని పల్లెటూరి పిల్లను కోడలిగా స్వీకరించలేనన్నారు. వంశం వృద్ధిలోకి రావాలంటే చదువుకున్న కోడలు అవసరమన్నారు.

మునసబుగారిని కలుసుకుని నేను శేషను ప్రేమిస్తున్నాననీ, పెళ్లిచేసుకుంటాననీ సూటిగా అడిగాను. మా పెద్దలకు ఇష్టంలేని సంబంధం చేసుకోవడంవల్ల ఇరువురికీ మంచిది కాదంటూ, నిరాకరించాడాయన.

నిరాశ చెందినా కృంగిపోలేదు నేను. ఓ రోజంతా తీవ్రంగా ఆలోచించాను. చివరికి – జన్మనిచ్చిన వారినీ, జన్మభూమినీ వదులుకోవడానికే నిశ్చయించుకున్నాను...

* * *

మునసబుగారి ఇంటి అరుగు ఎక్కుతూంటే నా గుండె దడదడలాడింది... లోపల చావిట్లో పడకకుర్చీలో పడుకుని చుట్ట కాల్చుకుంటూన్న మునసబుగారు నన్ను చూసి పైకి లేచారు. అప్పుడే అక్కడికి వచ్చిన శేష తల్లి నన్ను గుర్తుపట్టి, "లోపలికి రా బాబూ!" అంది మెల్లగా. వయస్సు తెచ్చిన మార్పు ఆ దంపతులలో స్పష్టంగా గోచరిస్తున్నాయి.

తడబడే అడుగులతో లోపలికి నడిచాను.

మౌనంగా కుర్చీ చూపించారు ఆయన. ఓ క్షణం మా ముగ్గురి మధ్యా భయంకర నిశ్శబ్దం. చివరికి శేష తల్లే ఆ నిశ్శబ్దాన్ని ఛేదించింది, "అమ్మాయి ఎలా వుంది బాబూ?" అడుగుతూంటే ఆమె గొంతుక గద్గదమయింది. తల్లి ప్రాణం!

సమాధానంగా నాతో భద్రంగా తెచ్చిన ఆ చిన్న పిడతను తీసి వారి ముందు వుంచాను.

అయోమయంగా చూసారు ఆ వృద్ధ దంపతులు. "ఏం జరిగిందీ?" ఆమె ముఖంలో భయపు నీడలు, ఆయన భ్రుకుటిలో ముడతలు. 'ఔను ఏం జరిగిందీ?...' – నా మనసు తెరపైన గతం కదలాడింది...

* * *

ఆనాడు నా తండ్రికి ఇష్టంలేదన్న ఒకే ఒక్క కారణంగా మునసబుగారు శేషతో నా వివాహానికి అంగీకరించకపోవడంతో... శేష మీద నాకున్న ప్రేమ తెగించింది... శేష భయపడుతున్నా ఎలాగో వొప్పించి అక్కా, బావల సహకారంతో శేషను తీసుకుని చెన్నై వెళ్లిపోయాను నేను. అక్కడ రిజిస్ట్రార్ సాక్షిగా ఆమెను నా అర్ధాంగిని చేసుకుని, ఇంటికి కూడా వెళ్లకుండా అటునుంచి అటే శేషతో అమెరికా వెళ్లిపోయాను.

శేషతో జీవితం వయ్యారాలు వొలికించే మంజుల గోదావరిలో ప్రశాంతంగా పయనించే



మానస ఆర్ట్ థియేటర్స్, రవీంద్ర ఆర్ట్ ప్రొడక్షన్స్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ కళా సుబ్బారావు వేదికలో జరిగిన సభలో "శ్రీ బెజ్జంకి లక్ష్మీనరసింహస్వామి సుప్రభాతం", "భక్తిగీతాలు" సి.డి. లను ఆవిష్కరిస్తున్న పద్మభూషణ్ డా॥ సి. నారాయణరెడ్డి. చిత్రంలో శ్రీయుతులు రాజేశ్వర్, వై. శ్రీనివాసులు, వెగ్గళం రవీంద్రాచారి, సిహెచ్. త్రినాధరావు, దీక్షితులు, రఘుశ్రీ, నోరి రాజేశ్వరరావు ఉన్నారు.

పూలనావే అయింది. తాను కూడా నా సొంగ త్యంలో ఉన్న ఊరిని, కన్నవారినీ మరచిపోయి నట్టే కనిపించింది.

అయితే మా ఆనందం మూణ్నాళ్ల ముచ్చట్టే అవుతుందని ఊహించలేకపోయాం. మా ఆనం దమయ జీవితంలో విధి విదిల్చిన విషపుబొట్టు కారణంగా శేషకు బ్రెస్ట్ క్యాన్సర్ అన్న భయం కర సత్యం బైటపడింది. అంతకుముందే ఆమె గర్భసంచిని తీసివేయాల్సి వచ్చింది. తమకిక పిల్లలు పుట్టరంటే కన్నవారికి తాను పుత్రశోకం కలిగించినందుకే భగవంతుడు తనకు ఆ శిక్ష విధించాడంటూ కుమిలిపోయింది. అమెరికాలో లభ్యమయ్యే బెస్ట్ ట్రీట్‌మెంట్ సైతం శేషను దక్కించలేకపోయింది. మూడేళ్లపాటు ఆ వ్యాధి తో పోరాడి అలసిపోయి... చివరికి మూడు నెలల క్రితం కన్నుమూసింది.

పోతూ పోతూ, 'ఏమండీ, మిమ్మల్ని ఒంట రిగా విడిచి వెళ్లిపోతున్నందుకు నన్ను క్షమిస్తారు కదూ? నా చితాభస్మాన్ని మా వాళ్లకు అప్పగించి మా ఊరి మట్టిలో కలపమని చెప్పండని చెప్పిం ది. అమ్మా నాన్నలకు నా క్షమాపణలు తెలియ జేయండి" అంటూ ఏడ్చింది...

* * *

మునసబుగారు ఏదో అనడంతో ఆలోచన ల్లోంచి తేరుకున్నాను. 'శేష చితాభస్మం ఇది. మూణ్ణెల్ల క్రితం క్యాన్సర్‌తో మరణించింది. మీకు తన క్షమాపణలు తెలిపి తన అస్థికలను మీకు అప్పగించమంది. ఊరి మట్టిలో కలపా లన్నది తన అంతిమకోర్కె..." నా గొంతుక గద్గదమయింది.

శేష తల్లి ఒక్కసారిగా గొల్లుమంది. మున సబుగారు దుఃఖం ఆపుకోవడానికి విశ్వప్రయ త్నం చేస్తున్నారు.

"నిజానికి శేష మిమ్మల్ని మరచిపోయిం దెప్పుడూ లేదు. మీతో చెప్పకుండా నాతో వచ్చేసినందుకు ఆమె లోలోపలే కుమిలిపోయే దనిపించేది నాకు. మీమీద శేషకు వున్న ప్రేమా భిమానాలు అలాంటివి..."

నా పలుకులతో ఆవిడ వెక్కిళ్లు హెచ్చాయి. వారి దుఃఖాన్ని, షాక్‌నీ పంచుకుంటూ నిశ్శ బ్దంగా వుండిపోయాను.

కొన్ని క్షణాల తరువాత కండువాతో కన్ను లు తుడుచుకుంటూ ఒణికే చేతులతో కూతురి అస్థికల పిడతను చేతుల్లోకి తీసుకున్నారాయన. దాన్ని పట్టుకుని రోదించింది ఆవిడ. కూతురే చేతుల్లో వున్నట్టుగా.

"మీ యిష్టానికి వ్యతిరేకంగా మీ అమ్మా యిని తీసుకుపోయినందుకు నన్ను క్షమించండి. ఉన్నన్నాళ్లూ శేషకు ఏలోటూ కలగకుండా కంటి పాపలా చూసుకున్నానని మాత్రం చెప్పగ లను..." మెల్లగా అన్నాను.

"శేష మరణంతో మీరు కోల్పోయింది మీ కూతుర్ని మాత్రమే. కాని నేను... నేను... నా జీవితాన్నే కోల్పోయాను..." తన్నుకు వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా ఆపుకున్నాను. బయ టకు ఉరుకుతున్న కన్నీటి కణాలు వారి కంట పడకుండా గిర్రున వెనక్కితిరిగాను.

గుమ్మం దగ్గర ఆగి మళ్లీ అన్నాను "శేష పేరిట పేదలకోసమని క్యాన్సర్ హాస్పిటల్ ఒకటి మన రాష్ట్రంలో కట్టించాలని నిశ్చయించు కున్నాను..."

యోగిలా, విరాగిలా మౌనంగా నేను నడచి వెళుతూంటే ఆ వృద్ధ దంపతులు అరుగుమీద నిలుచుని కన్నీటితో నాకు వీడ్కోలు ఇవ్వడం నా మనసుకు తెలుస్తూనే వుంది. ●